# అందరికీ మేలు చేసే ఐదేళ్ళ వేతన ఒప్పందం కోసం
# 19-20 ఆగస్టు 2009 రెండు రోజులు సమ్మె చేయండి!!

**- బిఎస్ఎన్ఎల్ఇయు**

కోల్ ఇండియాలో నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు 1.7.1996 తరువాత ఐదేళ్ళకు 1.7.2001 నుండి ఒక వేతన సవరణ సాధించుకున్నారు. మళ్ళీ ఐదేళ్ళకు 1.7.2006 నుండి అమలులోకి వచ్చే విధంగా మరో వేతన సవరణ సాధించుకున్నారు. ఐదేళ్ళ కొకసారి జరిగిన ఈ రెండు వేతన సవరణల వలన 1.7.1996తో పోలిస్తే వారి వేతనాలు పదేళ్ళలో 1.7.2006 నాటికి 52.52% పెరిగాయి. వారికి మళ్ళీ ఐదేళ్ళ తరువాత 1.7.2011 నుండి మరో వేతన సవరణ జరుగుతుంది.

ఇతర ప్రభుత్వరంగ సంస్థలన్నింటిలో గత వేతన సవరణ 1.1.1997 నుండి జరిగింది. తర్వాత పదేళ్ళకు ఇప్పుడు 1.1.2007 నుండి వేతన సవరణ జరుగుతున్నది. ఈ వేతన సవరణలో 30% పెంచుతామని మేనేజ్‌మెంట్స్ అంటున్నాయి. ఇది జరిగితే 1.1.1997 నాటి వేతనంతో పోలిస్తే పదేళ్ళకు 1.1.2007 నాటి వేతనంలో పెరుగుదల 30% మాత్రమే వుంటుంది. ఒక పదేళ్ళ వేతన సవరణ కన్నా రెండు ఐదేళ్ళ వేతన సవరణలు మంచిదని ఈ అనుభవం రుజువు చేసింది.

కాబట్టి ఇప్పుడు 1.1.2007 నుండి అమలు జరిగే వేతన సవరణ కాలపరిమితి ఐదేళ్ళే వుండాలని, మళ్ళీ 1.1.2012న మరో వేతన సవరణ జరగాలని ప్రభుత్వరంగ సంస్థల యూనియన్లు ఐక్యంగా పోరాడాయి. ఇందుకనుగుణంగా ఐదేళ్ళ ఒప్పందానికి వీలుగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు సాధించాయి. అయినప్పటికీ బిఎస్ఎన్ఎల్ వంటి కొన్ని ప్రభుత్వరంగ సంస్థలు ఐదేళ్ళ ఒప్పందం అయితే 30% కన్నా తక్కువ పెరుగుదల ఇస్తామని పేచీ పెడుతున్నాయి. మరికొన్ని ప్రభుత్వరంగ సంస్థలు 30% వేతన పెరుగుదలతో ఐదేళ్ళ ఒప్పందం ఇచ్చేందుకు దాదాపుగా సంసిద్ధమవుతున్నాయి.

ఇతర ప్రభుత్వరంగ సంస్థలన్నీ పే+78.2% డి.ఎ. పై 30% పెరుగుదలకు అంగీకరిస్తుండగా బిఎస్ఎన్ఎల్ మేనేజిమెంటు పే+68.8 శాతం పై మాత్రమే ఈ 30% పెరుగుదల ఇస్తామంటున్నది. అది కూడా తదుపరి వేతన సవరణ మళ్ళీ పదేళ్ళ తరువాత 1.1.2017 నుండి జరగటానికి ఒప్పుకుంటేనే ఇస్తానంటున్నది.

బిఎస్ఎన్ఎల్ బోర్డు డైరెక్టర్లు కనీస స్థాయిలో పే+78.2% డి.ఎ.పై 60% పైగా పెరుగుదలతో తమ వేతనాలు పెంచుకున్నారు. కానీ నాన్ ఎగ్జిక్యూటివ్స్‌కి ఇప్పుడు 30% పెంచి ఐదేళ్ళ తరువాత మరో వేతన సవరణకు వీలుగా ఐదేళ్ళ ఒప్పందం ఇవ్వాలనే స్వల్ప కోరికను తిరస్కరిస్తున్నారు. మనం ఐక్యంగా పోరాడితేనే ఈ స్వల్ప కోరికనయినా సాధించుకోగలం.

ఐదు సంవత్సరాల తరువాత 1.1.2012 నుండి మరో వేతన సవరణ జరిగినా దానివలన 1.1.2012కి ముందు రిటైరయ్యే వారికి ప్రయోజనం లేదనే అపోహ వున్నది. ఇది వాస్తవం కాదు. వేతన సవరణకు ముందు రిటైరైన వారి పెన్షన్, వేతన సవరణకు అనుగుణంగా రివైజ్ అవుతుంది. 1.1.2007కు ముందు రిటైరైన వారి పెన్షన్ 1.1.2007 నుంచి వేతన సవరణ జరిగిన అనంతరం తదనుగుణంగా రివైజ్ అవుతుంది. అదే విధంగా ఐదేళ్ళ తరువాత 1.1.2012 నుండి మళ్ళీ వేతన సవరణ జరిగితే అందు కనుగుణంగా 1.1.2012కి ముందు రిటైరయ్యే వారి పెన్షన్‌ను రివైజ్ చేయాలి. పెన్షనర్లందరినీ సమంగా చూడాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున ఇది అనివార్యం. కాబట్టి ఐదేళ్ళ వేతన సవరణ వలన అందరికీ మేలు జరుగుతుంది.

అందరికీ ప్రయోజనం జరిగే విధంగా ఐదు సంవత్సరాల వేతన ఒప్పందాన్ని పే+78.2% డి.ఎ.పై 30% కనీస పెరుగుదలతో సాధించేందుకు మేనేజ్‌మెంట్ పై ఒత్తిడి తేవాలని బిఎస్ఎన్ఎల్ యూనియన్ల ఐక్యవేదిక నిర్ణయించింది. ఇందుకోసం 19-20 ఆగస్టు 2009 తేదీలలో రెండు రోజుల సమ్మెకు పిలుపు నిచ్చింది.

కనుక ఉద్యోగులందరూ ఈ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరు తున్నాం.

అభినందనలతో

**బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్**

**................................ జిల్లా శాఖ**